క్లుప్తంగా

ఇరువర్గాల మధ్య ఘర్షణ

నెల్లూరు (క్రైమ్): నగరంలోని ములుమూడి బస్టాండ్ సమీపంలోని కూడలి వద్ద ఒకే ప్రాంగణంలో స్వామి వివేకానంద విగ్రహం, ఆజాద్ స్తూపం ఉన్నాయి. ఆజాద్ స్తూపం చుట్టూ గోడ నిర్మాణానికి ఓ వర్గం సోమవారం పనులు ప్రారంభించగా, మరో వర్గం అడ్డుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పి పంపించారు.

ఇంట్లో చోరీ

నెల్లూరు (క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ప్రభుత్వ ప్రధానాస్పత్రి ఎదురు వెలమసంఘంలో నరేష్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన భార్య గర్భవతి కావడంతో పక్క వీధిలో ఉంటున్న పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో గత నెల 23న నరేష్ ఇంటికి తాళం వేసి భార్య వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని ఒకటిన్నర సవర బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లారు. బాధితుడు సోమవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా ముసురు

- పలుచోట్ల వర్షాలు

నెల్లూరు(అర్బన్): ఫెంగల్ తుఫాన్ బలహీనపడినప్పటికీ దాని ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రెండు, మూడు చోట్ల భారీ వర్షాలు నమోదయ్యాయి. సోమవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా అనంతసాగరంలో 36.4 మి.మీ. వర్షం కురిసింది. వెంకటాచలం 32.0, సంగం 25.8, ముత్తుకూరు 20.4, పొదలకూరు 22.2, తోటపల్లిగూడూరు 18.4, కలువాయి 21.0, నెల్లూరు రూరల్ 15.8, ఉదయగిరి 15.4, చేజర్ల 14.6, అనుమసముద్రంపేట 12.0, ఇందుకూరుపేట 11.2, మనుబోలు 11.2, నెల్లూరు అర్బన్ 9.4 మి.మీ, కురిసింది. మరికొన్ని మండలాల్లో చిరు జల్లులు పడ్డాయి

పార్టీ అనుమతి అవసరం లేదు



మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): తాను నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో చేపడుతున్న గడపగడపకు మీ గిరిధర్‌రెడ్డి కార్యక్రమానికి టీడీపీ అనుమతి అవసరం లేదని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఎప్పుడూ ప్రజల మధ్యలోనే ఉన్నానని, ఇప్పుడు కూడా అలాంటి కార్యక్రమాన్నే చేపడుతున్నానని, దీనికి ప్రత్యేకించి పార్టీ పెద్దల అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని తాను భావిస్తున్నట్లు చెప్పారు. బుధవారం రూరల్ పరిధిలోని 19వ డివిజన్ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శని, ఆదివారం మాత్రమే ఈ కార్యక్రమం ఏడాది పాటు కొనసాగిస్తామన్నారు.

16న సింహపురి యునైటెడ్ క్యారల్స్



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్, డేవిడ్ దయాసాగర్

నెల్లూరు (బృందావనం): ఈ నెల 16న క్రీస్తు జనన సందేశాన్ని వివరించే సింహపురి యునైటెడ్ క్యారల్స్ నిర్వహించనున్నట్లు సింహపురి అసోసియేట్స్ ఇన్ క్రైస్ట్ సంస్థ చైర్మన్ గుర్రం అరుణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డౌనీహాల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సుబేదారుపేటలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. కన్వీనర్లు రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, బ్రదర్ పి.జానీజో మాట్లాడుతూ ఏబీఎం కాంపౌండ్ నుంచి ట్రంకు రోడ్డు మీదుగా వేదాయపాళెం, డైకస్‌రోడ్డు నుంచి బట్వాడిపాళెం సెంటర్ వరకు 'యునైటెడ్ క్యారల్స్' ర్యాలీ సాగుతోందన్నారు. ఈ సమావేశంలో మ్యూజిక్ డైరెక్టర్ బిల్లీశ్యాంసన్, సభ్యులు కె.విద్యాధర్, దినేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

నెల్లూరు (బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండూరు హరి నారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ 84వ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్‌చేసి, వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపకార్మిక కమిషనర్ రాచపాళెం రఘు, ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు తమ్మినేని పాండు పాల్గొన్నారు.

ట్రావెల్స్.. ట్రా'ఫికర్స్'

- మినీబైపాస్ రోడ్డును ఆక్రమిస్తున్న ట్రావెల్స్ బస్సులు
- సాయంత్రమైతే బారులు తీరుతున్న వాహనాలతో నానా అవస్థలు
- అత్యవసరమైతే అటుగా వెళ్తే అంతే సంగతులు
- మామూళ్లతో సరిపెట్టుకుంటున్న ఆయా శాఖల అధికారులు



నెల్లూరు మినీ బైపాస్ రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు

అత్యంత రద్దీగా ఉండే మినీబైపాస్ రోడ్డులో సాయంత్రమైతే ప్రజలకు ట్రాఫిక్ నరకం ప్రత్యక్షంగా కనిపిస్తోంది. నడిరోడ్డుపైనే గంటల తరబడి ట్రావెల్స్ బస్సులను నిలిపివేయడంతో నగర వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. దూర ప్రాంతాలకు ట్రావెల్స్ బస్సుల్లో వెళ్లే తమ వారిని ఎక్కించేందుకు వచ్చిన పలువురు వాహనదారులు సైతం రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో ఆ రోడ్డులో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. అత్యవసరంగా అటు వైపు వెళ్లాల్సి వస్తే అంతే సంగతలంటూ నగర ప్రజలు రుసరుసలాడుతున్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. రామలింగాపురం సెంటర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యపై కలెక్టర్‌కు నగరవాసులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ట్రావెల్స్, ప్రైవేట్ బస్సుల కోసం ప్రత్యామ్నాయ బస్టాండ్ కోసం స్థలాన్ని చూడాలని డీఆర్‌సీ సమావేశంలో ఆయా శాఖాధికారులకు కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలకు అతిగతీలేకుండా పోయింది.

నెల్లూరు నుంచి 120కు పైగా బస్సులు

నెల్లూరు నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వైజాగ్, అమరావతి తదితర ప్రాంతాలకు ప్రతి రోజు 120కు పైగా ట్రావెల్స్ బస్సులు వెళ్తున్నాయి. గతంలో ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో ప్రైవేట్ టావెల్స్ పాయింట్ ఉండేది. గత కొన్నేళ్ల నుంచి ఈ పాయింట్‌ను మినీబైపాస్‌లోని పెట్రోలు బంకు వద్దకు మార్చారు. ఈ ప్రాంతంలో రామలింగాపురం నుంచి దాదాపు ఆత్మకూరు బస్టాండ్ ఫ్లెఓవర్ వరకు బస్సులను నిలిపివేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పెద్దగా వ్యాపార సముదాయాలు కూడా లేవు. అప్పట్లో ట్రాఫిక్ సమస్య ఎదురు కాలేదు. ఇటీవల కాలంలో మినీబైపాస్‌లో పెద్దపెద్ద వ్యాపార దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఆస్పత్రులు సైతం మినీబైపాస్ సమీపంలోనే ఏర్పాటవుతున్నాయి. మినీబైపాస్ రోడ్డు ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. సాయంత్రం సమయంలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు పనివేళల తర్వాత వందలాది విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తున్నారు. ఇటు చెన్నై, అటు విజయవాడ ప్రధాన రహదారి కావడంతో సొంత వాహనాలు, ఆర్టీసీ బస్సులతో ట్రాఫిక్ మరింత క్లిష్టంగా ఉంటుంది. ఇంతటి రద్దీ రోడ్డుపైనే ట్రావెల్స్ బస్సులు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్‌పై కలెక్టర్, ఎస్పీలకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయినా అక్కడ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్రత్యామ్నాయ స్థలం చూడమని చెప్పినా..

ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాల కోసం బస్టాండ్ ఏర్పాటు చేసేందుకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలని కలెక్టర్ డీఆర్‌సీ మీటింగ్‌లో ఆదేశించారు. ప్రతి నెల కలెక్టరేట్‌లో రవాణా, పోలీసు, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఆరోగ్యశాఖ, నేషనల్ హైవే, పంచాయతీరాజ్, ఆర్టీసీ, డీపీఓ, డీఈఓ తదితర శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ మీటింగ్‌లో కూడా ఇదే విషయం చర్చ జరుగుతోంది. అయితే నెలలు గడుస్తున్నా.. ప్రైవేట్ బస్టాండ్‌కు ప్రత్యామ్నాయ స్థలంపై ఆయా శాఖాధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయం కూడా లేదని తెలిసింది. ఈ నెలకు సంబంధించి త్వరలోనే సమావేశం జరిగే అవకాశం ఉంది. ఆ సమయానికి అయినా.. కనీసం స్థలాన్ని ప్రతిపాదిస్తారా? సూచిస్తారా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

> **ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాం**
>
> ట్రావెల్స్ బస్సుల బస్టాండ్ కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని చూడాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో 4 ప్రాంతాలను గుర్తించి పరిశీలించాం. ఆ స్థలాలపై నివేదిక తయారు చేసి అందజేశాం. త్వరలో జరిగే రోడ్ సేఫ్టీ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతాం.
>
> – బి.చందర్, డీటీసీ



బ్యారికేడ్లు పెట్టి మరీ రోడ్డును ఆక్రమించి నిలుపుతున్న ట్రావెల్స్



కనుచూపు మేర సగం రోడ్డును ఆక్రమించిన ప్రైవేట్ బస్సులు

ప్రాణాలకు రక్షణ కల్పించండి

- ఎస్పీకి హిజ్రాల వినతి



ఎస్పీకి సమస్యను వివరిస్తున్న హిజ్రా మయూరి

నెల్లూరు (క్రైమ్): తమ ప్రాణాలకు ముప్పు ఉందని రక్షణ కల్పించాలని హిజ్రాలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వారు ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హాసిని హత్యతో మునుపెన్నడూ లేనివిధంగా జిల్లాలో పరిస్థితులు భయంకరంగా ఉన్నాయని, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న అభద్రతా భావంతో ఉన్నామన్నారు. ప్రత్యర్థి గ్రూపుల చేష్టలు భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. తాము ప్రశాంతంగా జీవించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీని కోరారు. స్పందించిన ఎస్పీ త్వరలోనే జిల్లాలోని హిజ్రాల కమ్యూనిటీతో సమావేశం నిర్వహించి పరిస్థితిని చక్క దిద్దుతామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మండల పూజ



అయ్యప్పస్వామి వారి శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలో కొలువైన అయ్యప్ప దేవస్థానంలో కేరళ సంప్రదాయ రీతిలో తంత్రులు మండల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరుగుతున్న అభిషేక, హోమ, పూజ, ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా తలమంచి వెంకటేశ్వరరావు, సునీత, మాల్యాద్రి, లక్ష్మి, సునీల్‌కుమార్, యక్షిత, ఎన్.శీనయ్య, పద్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవాసమాజం పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కె.మోహన్‌రావు, జి.విజయకుమార్, పావళ్ల ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు పోటీలు



విజేత విద్యార్థులతో ఆర్డీఓ అనూష

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం పాలిటెక్నిక్ విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. జాతీయ కాలుష్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరు (సెంట్రల్): నగరపాలక సంస్థ పరిధిలోని 23వ డివిజన్‌లో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలు సహకారం కావాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక నాయకులు, తదిరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన టౌన్ బస్సులు

నెల్లూరు (టౌన్): రవాణా అధికారుల తనిఖీల నేపథ్యంలో రెండు రోజుల పాటు నిలిపి వేసిన టౌన్ బస్సులను యజమానులు మళ్లీ రోడ్డెక్కించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి బస్సుకు జారీ చేసిన పర్మిట్ ప్రకారం కాకుండా వేరే రూట్లలో తిప్పడం, సమయపాలన పాటించకపోవడం తదితర కారణాలతో రెండు రోజుల క్రితం తనిఖీలు చేపట్టి 7 బస్సులపై కేసులు నమోదు చేసిన విషయం విదితమే. అయితే రెండు రోజుల పాటు నిలిపివేసిన టౌన్ బస్సుల యజమానులు సోమవారం నుంచి ఆయా రూట్లలో యథావిధిగా తిప్పుతున్నారు. అయితే రవాణా అధికారులు మాత్రం రానున్న రోజుల్లో నిబంధనలు అతిక్రమించిన టౌన్ బస్సులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. బస్సులు ఆగిన నేపథ్యంలో ఆటోవాలాలు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆటో యజమానుల అధిక చార్జీల వసూళ్లపై రవాణాధికారులు దృష్టి సారించి కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరిన గుర్తుతెలియని (40) వ్యక్తి మృతి చెందిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం గత నెల 28న అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని జీజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం ఉదయం ఆస్పత్రి గేటు వద్ద మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు ఆస్పత్రి సిబ్బంది దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో వాచ్‌మెన్ మృతి



మృతుడు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయ వాచ్‌మెన్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. కృష్ణయ్య (55) రెండేళ్లుగా రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ అక్కడే నివా సం ఉంటున్నాడు. అనారోగ్యంతో సోమవారం ఆయన కార్యాలయం వద్దనే మృతి చెందాడు. గమనించిన వీఆర్‌ఓ మధుసూదన్‌రావు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి ఆధార్ కార్డులో కృష్ణయ్య, సర్వేపల్లి కాలువకట్ట అని ఉంది. దీంతో పోలీసులు సర్వేపల్లి కాలువకట్ట పరిసర ప్రాంతాల్లో ఆరా తీయగా వివరాలు తెలియరాలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీసులకు తెలియజేయాలని స్థానిక పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు.

పునరావృతం కాకుండా పరిష్కరించండి

- అదనపు కమిషనర్ నందన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు (బారకాసు): అర్జీదారుల ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఈ వేదికలో స్థలాల ఆక్రమణలపై అత్యధికంగా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా విలీన గ్రామాలైన కుసుమహరిజనవాడ, రాయపు హరిజనవాడ తదితర ప్రాంతాలకు సంబంధించిన శ్మశాన వాటిక ఆక్రమణలకు గురవుతున్న ఫిర్యాదుపై స్థానిక తహసీల్దార్‌తో చర్చించామని, సంయుక్తంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్లు నిర్మాణం, డ్రైను కాలువల నిర్మాణానికి సంబంధించి అందుకున్న ఫిర్యాదులను ఆర్థిక అంశాల నేపథ్యంలో సంబంధిత ఇంజినీరింగ్ విభాగ అధికారులకు బదిలీ చేశామన్నారు. నగర పాలక కమాండ్ కంట్రోల్ సెంటర్ హెల్ప్‌లైన్ విభాగం ద్వారా వివిధ మాధ్యమాల నుంచి అందుకున్న ఫిర్యాదులకు 80 శాతం వరకు పరిష్కారం అందించగలిగామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణకిషోర్‌తో పాటు అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలతో ఈఓ, ఉత్సవ కమిటీ చైర్మన్ భక్తులు

నెల్లూరు (బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈఓ వి.గిరికృష్ణ తెలిపిన మేరకు ఈ ఏడాది సెప్టెంబరు 10 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు భక్తులు అమ్మ వారికి కానుకల రూపంలో రూ.6,30,430 సమర్పించారన్నారు. హుండీ లెక్కింపులో ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, ప్రధాన అర్చకుడు పి.చంద్రశేఖర్ స్వామి, భక్తులు పాల్గొన్నారు. దేవదాయశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్ కానుకల లెక్కింపును పర్యవేక్షించారు.

ఘంటసాల జయంతి రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, రవీంద్ర తదితరులు

నెల్లూరు (బృందావనం): అమరగాయకుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు బుధవారం కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్, లక్ష్మీఫర్నిచర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కేతా సుబ్బారావు తెలిపారు. ఈమేరకు ఆహ్వాన పత్రికలను పురమందిరం ప్రాంగణంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఘంటసాలను స్మరిస్తూ ఉదయం 10 గంటలకు పాటల నీరాజనం ఉంటుందన్నారు. విజేతలకు ప్రోత్సాహ బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేయనున్నామన్నారు. సమావేశంలో ఎం.రవీంద్ర, నాగినేని ప్రభాకర్, కేఎస్ బాబు, అమానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిపై సక్రమంగా విచారణ జరపాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కావలి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిపై సక్రమంగా విచారణ జరపాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యాలయంలో వారు సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ సంఘ జిల్లా కో-కన్వీనర్ పి.లీలామోహన్ మాట్లాడుతూ 2021లో కావలిలో పనిచేస్తున్న వార్డెన్లు, నాల్గో తరగతి ఉద్యోగులు అప్పటి కావలి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సుధాకర్ చేసిన వికృత చేష్టలపై ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పుడు ఆయన రిటైర్డ్ అయ్యే సమయంలో కలెక్టర్ ఐటీడీఏ పీఓను విచారణాధికారిగా నియమించారన్నారు. అయితే ఆమె అక్కడి వెళ్లి విచారణ చేయకుండా నెల్లూరు ఐటీడీఏ ఆఫీసులోనే స్టేట్‌మెంట్‌లు తీసుకోవడం, ఏకపక్షంగా చేసిన విచారణ రిపోర్టును కలెక్టర్‌కు ఇవ్వకుండా విజయవాడకు పంపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విచారణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్‌చార్జి సంజయ్, బీసీ యువజన విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మురళీ కృష్ణయాదవ్, సింహపురి స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కరిముల్లా, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఇర్ఫాన్ సయ్యద్, సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అస్త్రంగా వంతెన



పొట్టేపాళెం వద్ద ఉధృతంగా పారుతున్న నెల్లూరు కలుజు

- ప్రతి ఎన్నికల్లో బ్రిడ్జి నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీలు
- వంతెన నిర్మాణానికి నోచుకోని పొట్టేపాళెం కలుజు
- వర్షాలు పడితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- వాహనాలు పాడైపోతున్నాయని ఆవేదన

నెల్లూరు సిటీ: నెల్లూరు నుంచి జొన్నవాడ వెళ్లే దారిలోని పొట్టేపాళెం వద్ద నెల్లూరు చెరువు కలుజు వద్ద నిరంతరం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే సమస్య మరింత తీవ్రతరం అవుతోంది. రోడ్డుపై నీరు పారుదలతో వాహనదారులకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కలుజు వద్ద నిరంతరం నీరుపారుతుండడంతో పాచిపట్టి వాహనాలు జారిపోతున్నాయి. ముఖ్యంగా బైక్‌లు నడిపేవారు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యారు. ఇరిగేషన్ అధికారులు నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు కనీసం చెక్కలు ఏర్పాటు చేయలేదు.

వంతెన నిర్మాణం ఎప్పుడో?

నెల్లూరు నుంచి జొన్నవాడ వైపు ప్రతి రోజూ వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. నరసింహస్వామి కొండ, సౌత్‌మోపూరు, జొన్నవాడ, బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతాలకు ఈ దారి నుంచి వెళుతుంటారు. అయితే ఎన్నికల సమయంలో పొట్టేపాళెం కలుజు వద్ద హైలెవల్ వంతెన నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే హామీలు గుప్పించారు. అయితే ఎన్నికల్లో గెలిచిన తర్వాత మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచిన కోటంరెడ్డి ఇదే విషయాన్ని ప్రతి ఎన్నికల ప్రచాస్త్రంగా ఉపయోగించుకుంటున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఎప్పుడో నిర్మాణం పూర్తయ్యేదంటున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉన్న కోటంరెడ్డికి చెప్పినా.. కనీసం స్పందించలేదనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే పొట్టేపాళెం కలుజు వద్ద శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



నీరు చిమ్ముకుంటూ వస్తున్న వాహనాలు



ద్విచక్ర వాహనచోదకులకు తప్పని వేతలు